క్లుప్తంగా

వేడుకలకు హాజరుకావాలి



మహబూబాబాద్ రూరల్: పట్టణంలో జరుగనున్న గ్రామ దేవత (బొడ్రాయి) ద్వితీయ వార్షికోత్సవ వేడుకల్లో పట్టణ ప్రజలందరూ పాల్గొనాలని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. వాకోత్సవ కరపత్రాలను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శుక్రవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈనెల 12వ తేదీన జరుగనున్న బొడ్రాయి ఉత్సవానికి ప్రతీ ఒక్కరు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో బొడ్రాయి కమిటీ సభ్యులు మదన్ గోపాల్ లోయ, పిల్లి సుధాకర్, ఎడ్ల రమేష్, ఆకుల హరిప్రసాద్, శంతన్ రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం

మహబూబాబాద్: మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ కవర్ల నివారణ చర్యలో భాగంగా మున్సిపల్ సిబ్బంది పలు షాపుల్లో తనిఖీ చేయగా 60కేజీల కవర్లు లభ్యం కాగా వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, పర్యావరణ అధికారి గుజ్జు క్రాంతి మాట్లాడుతూ.. రూ.8వేల జరిమానా విధించామన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీధర్ పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలు చేయాలి

గూడూరు: పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు చేపట్టాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రమీలరావు అన్నారు. మండలంలోని తీగలవేణి పీహెచ్‌సీని శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని జాతీయ కార్యక్రమాలకు సంబంధించిన రిజిస్టర్‌లను పరిశీలించారు. అనంతరం ఆస్పత్రిలోని లేబర్ గది, ఐఎల్ఆర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఈ గీత, ఆస్పత్రి వైద్యుడు రాంబాబు, అమల పాల్గొన్నారు.

జాతీయ రహదారి అలైన్‌మెంట్ మార్చాలి

మహబూబాబాద్ రూరల్: వలిగొండ నుంచి మహబూబాబాద్ మీదుగా భద్రాచలం వరకు నిర్మాణం జరగనున్న జాతీయ రహదారి 930పీ అలైన్‌మెంట్ మార్చాలని కోరుతూ పలువురు బాధితులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని హైదరాబాదులో బుధవారం కలిసి విన్నవించారు. కార్యక్రమంలో బాధితులు నీరుటి లక్ష్మీనారాయణ, బాలకృష్ణ, బాలాజీ, రంజిత్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

నర్సింహులపేట: హాస్టళ్లలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని తహసీల్దార్ నాగరాజు అన్నారు. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్, బీసీ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ అఖీల్, వార్డెన్లు పాల్గొన్నారు.

ఏజెన్సీ రైతులకు సాగునీరందించాలి

కొత్తగూడ: కొత్తగూడ, గంగారం మండలాల రైతులకు రెండు పంటలకు సాగు నీరందించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొమ్మనబోయిన వేణు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. పాకాల రిజర్వాయర్ నుంచి లిఫ్ట్ ద్వారా రెండు మండలాల చెరువులకు నీరందిస్తామని మంత్రి సీతక్క ఎన్నికల్లో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. సమావేశంలో నాయకులు బాబు, నెహ్రూనాయక్, యాకన్న పాల్గొన్నారు.

పునరుద్ధరించాలి

గార్ల: గార్ల రైల్వేస్టేషన్‌లో మణుగూరు ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదలను రైల్వే ఉన్నతాధికారులు తిరిగి పునరుద్ధరించాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడారు. సమావేశంలో రామారావు, శ్రీనివాసరావు, విమల్‌జైన్ పాల్గొన్నారు.

జోరుగా గుడుంబా దందా

- గుట్టుచప్పుడు కాకుండా విక్రయం
- రహస్య ప్రదేశాల్లో బట్టీల ఏర్పాటు
- రసాయనాలు కలిపి తయారీ
- నిర్మూలించాలని కోరుతున్న ప్రజలు

దంతాలపల్లి: మండలంలో గుట్టుచప్పుడు కాకుండా గుడుంబా తయారు చేస్తున్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం గుడుంబా రహిత రాష్ట్రం కోసం చర్యలు చేపట్టింది. కాని కొంతమంది మాత్రం ప్రభుత్వ ఆదేశాలను పక్కన బెట్టి ధనార్జనే లక్ష్యంగా గుడుంబా రవాణా చేస్తున్నారు. గతంలో కుండల్లో వారం రోజులపాటు బెల్లం, పటిక, వివిధ రకాల పండ్లతో నానబెట్టి నాణ్యమైన గుడుంబా తయారు చేసేవాళ్లు. కాని ఇప్పుడు మాత్రం డబ్బు సంపాదనే ధ్యేయంగా గుడుంబా విక్రయదారులు భావిస్తున్నారు. వివిధ రకాల రసాయనాలు ఉపయోగించి రెండు, మూడు రోజుల్లో గుడుంబా తయారు చేస్తూ ప్రజల ఆరోగ్యాలతో ఆడుకుంటున్నారు. తెల్లవారేసరికి యువకులు, ప్రజలు గుడుంబా తాగి మద్యం మత్తులో కుటుంబ సభ్యులతో గొడవలు పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. మద్యం మత్తులో ఎలాంటి చర్యలకైన వెనకాడడం లేదు. ఇప్పటికైన సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో గుడుంబాను నిర్మూలించాలని ప్రజలు కోరుతున్నారు.



గుడుంబా బట్టీ

పీడీ యాక్ట్ కేసులు పెడతాం..



ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ అక్రమంగా గుడుంబా తయారు చేసిన, విక్రయించిన వారిపై పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తాం. గ్రామాల్లో గడుంబా తయారీ కేంద్రాలపై నిఘా ఉంచాం. గుడుంబా రహిత గ్రామాలే లక్ష్యంగా పని చేస్తున్నాం. ఎవరైన గుడుంబా తయారు చేస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలి. చెప్పిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం.

– ప్రవీణ్, ఎక్సైజ్ సీఐ, తొర్రూరు

గిరిజనులకు అన్యాయం చేయొద్దు

మహబూబాబాద్: అలైన్‌మెంట్‌ను మార్పు చేసి సాలార్ తండా గిరిజనులకు అన్యాయం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని తండావాసులు శుక్రవారం సాలార్ తండా వద్ద గిరిజన మహిళలు ఆందోళన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. బడా బాబులకు న్యాయం చేసేందుకు ఎన్‌హెచ్–930పీ జాతీయ రహదారి అలైన్‌మెంట్ మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. సాలార్ తండా రజాలిపేట, ఇల్లెందు రోడ్డు ఇళ్ల మధ్య నుంచి రహదారి నిర్మాణం చేసేందుకు మార్కింగ్ చేస్తున్నారన్నారు. గతంలోనే కలెక్టరేట్, మెడికల్ కాలేజీల నిర్మాణం విషయంలో గిరిజన భూములను లాక్కున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా సాలార్‌తండా వాసులకు తీరని అన్యాయం చేసి మళ్లీ నష్టం చేసేందుకు పూనుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు.



ఆందోళన చేస్తున్న గిరిజన మహిళలు, బాధితులు

బాలికల భద్రతే షీటీం లక్ష్యం



మాట్లాడుతున్న షీటీం ఎస్సై సునంద

మహబూబాబాద్ అర్బన్: బాలికలను ఎవరైన గుర్తు తెలియని వ్యక్తులు వేధిస్తే ధైర్యంగా మహిళా పోలీసులకు ఫిర్యాదు చేయాలని షీ టీం ఎస్సై సునంద తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం షీటీం ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. బాలికల భద్రతే షీటీం లక్ష్యమన్నారు. చిన్నచిన్న విషయాలకు ఆవేదనకు గురికాకుండా మంచి ఆలోచనలతో ఉన్నత చదువులు చదవాలన్నారు. ఎక్కడైన వేధింపులు జరిగినట్లుయితే వెంటనే షీటీం వాట్సాప్ 87126 56935 ఫోన్ నంబర్‌ను సంప్రందించాలన్నారు. కార్యక్రమంలో ఉమెన్ పీఎస్ ఎస్సై హన్మకొండ ఆనందం, కళాశాల ప్రిన్సిపాల్ పాక్కుల సందానందం, అధ్యాపకులు రవికిరణ్, రీయాజ్, షీటీం సిబ్బంది అరుణ, రమేశ్ పాల్గొన్నారు.

సాగునీరు అందించి పంటలను కాపాడాలి

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు రూరల్: రబీ సీజన్‌లో సాగు చేస్తున్న పంట పొలాలకు సాగునీరు అందించి రైతులను కాపాడాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని కర్కాల, అరిపిరాల గ్రామాల సమీపంలోని పాలేరు, బయ్యన్న వాగుల పరిధిలో నీరులేక ఎండిపోతున్న పంట పొలాలను దయాకర్‌రావు, బీఆర్ఎస్ పార్టీ మండల, గ్రామ నాయకులు, రైతులతో కలిసి పరిశీలించారు. ఎస్సారెస్పీ జలాలు విడుదల చేసి పాలేరు, బయ్యన్నవాగుల్లో ఉన్న చెక్‌డ్యామ్‌లను నింపకుంటే తమపంటలన్నీ ఎండిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించిన దయాకర్‌రావు సంబంధిత ఎస్సారెస్పీ అధికారులకు ఫోన్ చేసి వెంటనే సాగునీటిని విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ మంగళపెల్లి శ్రీనివాస్, నాయకులు రామిని శ్రీనివాస్, అనుమాండ్ల ప్రదీప్‌రెడ్డి, ఎస్‌కే అంకూస్, మహంకాళి భూపతి, గ్రామాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.



అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న దయాకర్‌రావు

గిట్టుబాటు ధర చెల్లించాలి

తొర్రూరు: మిరప రైతులకు గిట్టుబాటు ధర అందించాలని కేవైయూకేఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి జక్కుల యాకయ్య అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలో కేవైయూకేఎస్ డివిజన్ కమిటీ సమావేశం నిర్వహించారు. యాకయ్య మాట్లాడుతూ గతేడాది మిర్చి క్వింటాల్‌కు రూ.21వేలు ఉండగా ఈ ఏడాది రూ.12వేలు కూడా పలకడం లేదన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రాములు, వెంకటయ్య, యాకయ్య, కేశవులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

మరిపెడ: క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని తహసీల్దార్ దొడ్డ సైదులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్జేఆర్ఎం డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో బ్లాక్ స్థాయి క్రీడలను తహసీల్దార్ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బానోతు కల్పతి, నవయుగ విజన్‌యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరన్ననాయక్, రాజేందర్‌నాయక్ పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వం

గార్ల: ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్ పార్టీకి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా నాయకుడు జడ సత్యనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని ముత్తితండా గ్రామంలోని పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈనెల 20న చలో హైదరాబాద్ కార్యక్రమంను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రహదారి నిర్మాణానికి భూమి పోతుందని ఆత్మహత్యాయత్నం

మహబూబాబాద్ రూరల్: జాతీయ రహదారి నిర్మాణంలో తమ వ్యవసాయ భూమిపోతుందని మనస్తాపానికి గురై ఓ వ్యక్తి పురుగుల మందుతాగి ఒకరి ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన శుక్రవారం జిల్లా కేంద్రం శివారులోని సాలార్ తండలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రం శివారులోని సాలార్ తండాకు చెందిన భూక్య గోపికి సర్వే నంబరు 255లో 15 గుంటల భూమి ఉంది. ఆ భూమి మీదుగా జాతీయ రహదారి 930 పీ వెళ్తుండగా గోపి భూమి అందులో కలువనుంది. బాధితుడికి నష్టం కలిగే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారని మనోవేదనకు గురైన గోపి పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు.

మిరప తోటలోకి దూసుకెళ్లిన కారు

కురవి: ఖమ్మం నుంచి 365/ఏ జాతీయ రహదారిపై కారులో కురవి వైపునకు వస్తుండగా మండలంలోని నల్లెల్ల శివారు సూర్యతండా వద్ద కారు అదుపు తప్పి పక్కనే ఉన్న మిరపతోటలోకి దూసుకెళ్లిన ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ కాచిగూడ ప్రాంతానికి చెందిన కమ్మ వినీత్‌రెడ్డి అనే విద్యార్థి తన సొంత కారులో చెన్నై నుంచి ఖమ్మం నుంచి కురవి మీదుగా నర్సంపేటకు వెళ్తున్నాడు. ఈక్రమంలో శుక్రవారం తెల్లవారుజామున నిద్రమత్తులో సూర్యతండా వద్ద కారు అదుపుతప్పి పక్కనే ఉన్న మిరపతోటలోకి దూసుకెళ్లింది. వినీత్‌రెడ్డికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మహబూబాబాద్ రూరల్: మండలంలోని ఆమనగల్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతులు నిర్వహిస్తున్నామని విద్యుత్ శాఖ రూరల్ ఏఈ వెంకటేష్ శుక్రవారం తెలిపారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, ఇందుకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపల్ పరిధిలోని ఈదులపూసపల్లి, జమాండ్లపల్లి, గాంధీపురం, అనంతారం వార్డులో, అదేవిధంగా పాతబజారులో ఉన్న వార్డుల్లో సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా నేడు శనివారం ఉదయం 9 గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ అంతరాయం సరఫరా నిలిపివేస్తున్నట్లు పాతబజారు ఏఈ జింక సంగీత శుక్రవారం తెలిపారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కోసమే కులగణన



నిరసన తెలుపుతున్న నాయకులు

నెహ్రూసెంటర్: ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కాపాడుకునేందుకే కులగణన చేపట్టారని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కార్యదర్శి ముంజాల రాజేందర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కులగణన సమగ్రంగా చేయాలని రాహుల్ గాంధీ ఆదేశిస్తే, ఇక్కడ మాత్రం తప్పుల తడకగా కులగణన చేపట్టారని ఆయన ఆరోపించారు. 6శాతం ఉన్న ఓసీ జనాభాను 13.31 శాతం తప్పుగా చూపిస్తుందన్నారు. బీసీలు ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వర్గాలను కలుపుకుని రాజ్యాధికారం కోసం పోరాటం చేయాలని అన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గండి వీరేందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కొడుపుగంటి శ్రీధర్, అధికార ప్రతినిధి జంపన్న, దొంతు శ్రవణ్, శ్రీను, సతీష్ పాల్గొన్నారు.

పశు వ్యాధులపై అవగాహన ఉండాలి

మహబూబాబాద్: పశువులకు సంక్రమించే అన్నిరకాల వ్యాధులపై రైతులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా పశుసంవర్ధక, పశు వైద్యాధికారి కిరణ్‌కుమార్ అన్నారు. శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం శాఖ కార్యాలయంలో బాయిలర్, లేయర్ ఫామ్స్ యాజమానులకు బర్డ్‌ఫ్లూ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఫౌల్ట్రీ ఫామ్‌లలో బయో సెక్యూరిటీ చర్యలు చేపట్టాలన్నారు. మృతి చెందిన కోళ్లను గుంత తీసి సున్నం చల్లి పూడ్చిపెట్టాలన్నారు. కోళ్ల తరలించే వాహనాలను, గుడ్ల ట్రేలను, పరికరాలను శానిటైజేషన్ చేయాలన్నారు. అసాధారణ మరణాలుంటే స్థానిక పశు వైద్యాధికారికి తెలియజేయాలన్నారు. ఫామ్‌లోకి వెటర్నరీ అధికారులను తప్పా ఇతర వ్యక్తులను అనుమతించవద్దన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి కిరణ్‌కుమార్

నులిపురుగుల నివారణకు కృషి



కురవి: మాట్లాడుతున్న వైద్యురాలు స్రవంతి

కురవి: ఈనెల10వ తేదీ జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని 19 ఏండ్ల లోపు చిన్నారులందరికీ ఆల్బెండాజోలు నోటి మాత్ర అందించి నులి పురుగుల నివారణకు కృషి చేయాలని బలపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి స్రవంతి అన్నారు. శుక్రవారం బలపాల పీహెచ్‌సీ ఆవరణలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ యశస్విని, డాక్టర్ కరుణాకర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ భద్రమ్మ, సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

గార్ల: పిల్లలందరూ నులిపురుగు నివారణ మాత్రలు వేసుకోవాలని ముల్కనూరు పీహెచ్‌సీ డాక్టర్ శివకుమార్ సూచించారు. శుక్రవారం పీహెచ్‌సీలో సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసమావేశంలో సీహెచ్ఓ సక్కుబాయి, హెచ్ఎస్ ఇస్మాయిల్ బేగ్, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

దంతాలపల్లి: పిల్లల్లో నులిపురుగుల నివారణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దారు రాజేశ్వర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో వైద్యులు, అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వివేక్‌రామ్, డీటీ శ్రీలత, వైద్యులు వాణి, ఎంపీఓ అప్సర్‌పాషా, తదితరులు పాల్గొన్నారు

సంక్షిప్త సమాచారం

కాంగ్రెస్‌లో చేరిక

కొత్తగూడ: మండలంలోని ఓటాయి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి ములుగు నియోజకవర్గ మహిళా నాయకురాలు కుంజ కుసుమాంజలి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు సారయ్య, రూప్‌సింగ్, రణధీర్ పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

నెల్లికుదురు: సేంద్రియ వ్యవసాయాన్ని ప్రతీ ఒక్కరు ప్రోత్సహించాలని జర్మనీ దేశస్తురాలు మౌనికా రటిరింగ్ అన్నారు. మండలంలోని సొల్లతండా శివారు శనిగకుంట తండాలోని బానోతు విజయ్ అరుణ దంపతులు చేస్తున్న సేంద్రీయ వ్యవసాయాన్ని మహర్శి గోషాల ఫౌండర్ ప్రెసిడెంట్ రమేశ్‌తో కలిసి శుక్రవారం జర్మనీ దేశస్తురాలు సందర్శించారు.

42శాతం రిజర్వేషన్లు కల్పించాలి

నెల్లికుదురు: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని పేదల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిరగాని భిక్షపతి గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్‌ను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి రిజర్వేషన్లపై వివరించారు.

క్రీడా సామగ్రి పంపిణీ

బయ్యారం: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో క్రీడా సామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా గార్ల–బయ్యారం సీఐ రవికుమార్, ఎస్సై తిరుపతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. క్రమశిక్షణతో చదవటంతో పాటు సైబర్ క్రైంపై విద్యార్థులు అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ దేవేంద్రాచారి, ఉపాధ్యాయులు భిక్షం, రవీందర్ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు

మరిపెడ రూరల్: అర్హులైన నిరుపేదలకు వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు, వృత్తిదారులకు పెన్షన్ మంజూరు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాణాల రాజన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. శుక్రవారం మండలంలోని తాళ్లఊకల్ గ్రామంలో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

సైదుల్ బాబా చిల్లా ప్రారంభం

మహబూబాబాద్ రూరల్: మండలంలోని వేమునూర్ గ్రామంలో హజ్రత్ సయ్యద్ అలీ మీరాతర్ సైదుల్ బాబా చిల్లా ప్రారంభోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మురళీనాయక్, ఉమ దంపతులు, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



కురవి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆడదూడలు పుట్టే లింగ నిర్ధారణ పద్ధతి అందుబాటులో ఉందని, రైతు సోదరులు సద్వినియోగం చేసుకోవాలని కురవి మండల పశువైద్యాధికారి రాజేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజ్) గ్రామంలో ఉచిత గర్భకోశ వ్యాధుల నివారణ చికిత్స శిబిరం నిర్వహించారు.

చర్య తీసుకోవాలి

నర్సింహులపేట: మండలంలోని రామన్నగూడెం శివారులోని అకేరు వాగు నుంచి అక్రమ ఇసుక నియంత్రణకు తీసిన ఇసుక ట్రెంచ్‌లను పూడ్చిన వ్యక్తులు, ఇసుక ర్యాంపు ఓనర్లపై చట్ట పరంగా చర్య తీసుకోవాలని శుక్రవారం సాయంత్రం తహసీల్దార్ నాగరాజు పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై మాలోతు సురేష్ తెలిపాడు.

ఎరువులు అందుబాటులో ఉండాలి

పెద్దవంగర: రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలని ఏడీఏ విజయచంద్ర అన్నారు. శుక్రవారం మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపులను ఏఓ స్వామినాయక్‌తో కలిసి సందర్శించారు. దుకాణాల్లో పలు రిజిస్టర్లను తనిఖీ చేసి నిల్వలను పరిశీలించారు.

సత్యవతి రాథోడ్‌కు శుభాకాంక్షలు

మరిపెడ రూరల్: శాసనమండలిలో బీఆర్ఎస్ విప్‌గా నియామకం అయిన సత్యవతి రాథోడ్‌ను మండలంలోని గిరిపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సత్యవతి రాథోడ్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు షేక్ యాకుబ్ పాషా, యాకుబ్ పఠాన్, వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు.

స్వయంపాలన దినోత్సవం

గూడూరు: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. హెచ్ఎం డాక్టర్ లలితా కుమారి, హెచ్‌డబ్ల్యూఓ దేవదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న శ్రీనివాసరావు

మరిపెడ రూరల్: మధ్యప్రదేశ్ రాష్ట్రం ఖండువా జిల్లా భగవాన్‌పుర గ్రామానికి చెందిన నితేష్ (19) లూనావత్‌తండాలో వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. వారి వద్ద ఆర్థికస్తోమత లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. మిర్చి ఏరేందుకు వచ్చి.. మృత్యువాత.. సాక్షిలో శుక్రవారం వచ్చిన కథనానికి ఖమ్మం జిల్లాకు చెందిన అన్నం ఫౌండేషన్ నిర్వాహకుడు అన్నం శ్రీనివాసరావు స్పందించారు. మృత దేహాన్ని ఖమ్మం తరలించి అక్కడ దాహన సంస్కరణలు చేశాడు.

కంఠమహేశ్వరస్వామి కల్యాణ వేడుకలు



మరిపెడ: మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో గౌడ కులస్తుల ఆరాధ్యదైవం అయిన కంఠమహేశ్వర స్వామి, సురాంబ కల్యాణ వేడుకలు శుక్రవారం ప్రారంభం అయ్యాయి. మొదటి రోజు గౌడ కులస్తులు బిందెలలో నీళ్లతో ఊరేగింపుగా ఆలయానికి తరలి వచ్చారు. స్వామివారికి జలాభిషేకం చేసి వేడుకలు నిర్వహించారు.

క్రైం కార్నర్..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

డోర్నకల్: డోర్నకల్ శివారు రైల్వే బ్రిడ్జి సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై గడ్డం ఉమ తెలిపిన వివరాల ప్రకారం.. డోర్నకల్ సమీపంలోని రైల్వే బ్రిడ్జి దాటి లచ్చాతండా వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం, ఖమ్మం నుంచి వస్తున్న కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ద్విచక్రవాహంపై వెళ్తున్న ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం పాపటపల్లికి చెందిన వడ్డె వేణు(38)కు తీవ్ర గాయాలయ్యాయి. వాహనదారులు క్షతగాత్రుడిని వైద్యం చికిత్స నిమిత్తం 108వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి సోదరుడు రామనర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దాడికి యత్నించిన వ్యక్తి అరెస్ట్

డోర్నకల్: భార్య, కుమారుడిపై దాడికి యత్నించిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డోర్నకల్ ఎస్సై గడ్డం ఉమ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. పెరుమాళ్ల సంకీస గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మహేష్ భార్య, కుమారుడిపై డీజిల్ పోసి హత్యాయత్నానికి పాల్పడిన కేసులో మహేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీలో తాత్కాలిక ఉద్యోగిగా పని చేస్తున్న వ్యక్తిపై దాడి చేసిన మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు డోర్నకల్ ఎస్సై గడ్డం ఉమ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. ఉద్యోగి దారావత్ సాయినాయక్‌పై తేజావత్ రమేశ్ అనే వ్యక్తి దాడి చేసి గాయపర్చగా సాయినాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆటో, లారీ ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

మరిపెడ: ఆటోను లారీ ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మరిపెడ మున్సిపాలిటీ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. మరిపెడ ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం మేడిదపల్లి గ్రామానికి చెందిన వల్కి సమంత ప్యాసింజర్ ఆటోలో మరిపెడ మున్సిపాలిటీకి వస్తున్న క్రమంలో మరిపెడ శివారులో టాటా షోరూం సమీపంలో లారీ ఆటోను ఢీకొట్టింది. దీంతో సమంతకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

మరిపెడ రూరల్: వరకట్నం వేధింపుల కింద మరిపెడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయినట్లు ఎస్సై సతీష్ శుక్రవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని పురుషోత్తమాయగూడెం గ్రామానికి చెందిన వంగూరు నాగలక్ష్మీ ప్రస్తుతం ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శిగా కొడకాండ్ల మండలం నర్సింగాపురం గ్రామంలో విధులు నిర్వహిస్తుంది. ఆర్మీలో క్లర్క్‌గా పనిచేస్తున్న వరంగల్‌కు చెందిన మట్టి హరీశ్‌కు నాగలక్ష్మిని ఇచ్చి ఐదేళ్ల క్రితం పెద్దల సమక్షంలో వివాహం చేశారు. వివాహ సమయంలో రూ.15లక్షలు, 6 తులాల బంగారం పెట్టారు. అయినప్పటికీ అమ్మనాన్న, ఆడబిడ్డ మాటలు విని కొద్ది రోజులుగా అదనపు కట్నం కోసం నాగలక్ష్మిని వేధింపులకు గురిచేస్తున్నారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు వరకట్న వేధింపుల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

దంతాలపల్లి: ఆగి ఉన్న లారీని ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన లారీ డ్రైవర్ సోను వరంగల్ పైపు నుంచి పత్తి లోడుతో కోదాడ వెళ్తున్నాడు. మండలకేంద్రంలో ఆపి టీ తాగుతున్న సమయంలో ఖమ్మం నుంచి వరంగల్ వైపు వెళ్తున్న లారీ ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఢీకొట్టిన లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. 108 వాహనంలో చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ మృతి

కొత్తగూడ: రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై చికిత్స పొందుతూ ఆటోడ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని కార్లాయి గ్రామంలో వెలుగుచూసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కార్లాయి గ్రామానికి చెందిన కొట్టం కుమారస్వామి(38) 15రోజుల క్రితం వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలకేంద్రం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అప్పటి నుంచి హన్మకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

కేసముద్రం మార్కెట్‌లో టోపోగ్రాఫికల్ సర్వే

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం టోపోగ్రాఫికల్ సర్వే నిర్వహించారు. మార్కెట్‌లో నాలుగు రకాల అంతర్గత సీసీ రోడ్లు, షెడ్లకు మధ్య గ్యాప్‌లో షట్టర్స్ ఏర్పాటు, కార్యాలయ భవనానికి లిఫ్ట్, గోదాంల మరమ్మతు, డ్రెయినేజీ వ్యవస్థ, రైతు విశ్రాంతి భవనానికి ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేయాలని మార్కెట్ ఇంజనీరింగ్ శాఖ వరంగల్ డీఈ ఎల్లేష్‌కు మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు డీఈ ఆదేశాలతో వరంగల్ నుంచి వచ్చిన ప్రత్యేక సర్వే బృందం టోపోగ్రాఫికల్ సర్వే(శాటిలైట్) నిర్వహించారు. నివేదికను సర్వే బృందం ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు మార్కెట్ స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ అమరలింగేశ్వర్‌స్వామి తెలిపారు. ఆ తర్వాత అధికారులు మార్కెటింగ్‌శాఖకు అంచనాలతో నివేదికను అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ చిదురాల వసంతరావు, గ్రేడ్–3 సెక్రటరీ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.